క్లుప్తంగా

గాయత్రికి అభినందనలు


గాయత్రిని సన్మానిస్తున్న బీఎస్పీ నాయకులు

కేశంపేట: ఇటీవల ప్రకటించిన ఎస్ఐ ఫలితాల్లో మండలంలోని చౌలపల్లి గ్రామశివారులోని మీనమోనిపల్లికి చెందిన అనపోపల ఎస్ఐ ఉద్యోగానికి అర్హత సాధించింది. ఈ సందర్భంగా బీఎస్పీ మండల అధ్యక్షుడు హరికుమార్ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం ఆమెను పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఉద్యోగంలో ఉన్నతస్థాయికి చేరుకొని గ్రామానికి, మండలానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ కోశాధికారి భీమయ్య, హరికుమార్, శ్రీనివాస్, చంద్రయ్య, రమేష్, సత్యానారాయణ పాల్గొన్నారు.

శరత్‌చంద్రయాదవ్‌కు సన్మానం

షాద్‌నగర్‌రూరల్: ఇటీవల ప్రకటించిన ఎస్ఐ ఫలితాల్లో పట్టణానికి చెందిన శరత్‌చంద్రయాదవ్ ఎస్ఐ ఉద్యోగానికి అర్హత సాధించాడు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయనను పీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్, కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. శాలువాతో సన్మానించి, స్వీట్లు తినిపించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్యయాదవ్, బాబర్‌అలీఖాన్, చెన్నయ్య, శ్రీధర్, ఖదీర్, అశోక్, భాస్కర్, ముబారక్‌అలీ, నవీన్ పాల్గొన్నారు.

‘గృహలక్ష్మి’కి దరఖాస్తు చేసుకోండి

ఎంపీడీఓ వెంకయ్యగౌడ్


దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపీడీఓ

శంకర్‌పల్లి: గృహలక్ష్మి పథకానికి గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ వెంకయ్యగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరించారు. మహారాజ్‌పేట్‌కు చెందిన లబ్ధిదారుల దరఖాస్తులను సర్పంచ్ స్వయంగా అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు గృహలక్ష్మి పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. 425 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో మహారాజ్‌పేట్ సర్పంచ్ నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బాసుపల్లి రాజు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి


కమిటీ ఏర్పాటులో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కొందుర్గు: గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు నరేందర్ అన్నారు. మండలంలోని టేకులపల్లి గ్రామంలో శుక్రవారం ఎస్సీ సెల్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రామస్వామి, ఉపాధ్యక్షుడిగా సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా యాదయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదల బతుకులు మారుతాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అమృతయ్య, నర్సింహారెడ్డి, శేఖర్, పైల్‌మాన్, అమీద్, శ్రీను పాల్గొన్నారు.

యువత ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయాలి

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


జ్ఞాపికలు అందజేస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

షాబాద్: యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయాలని మాజీ ఎంపీ, బీజేపీ సీనియర్ నాయకులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం రాత్రి మండలంలోని సీతారాంపూర్ శ్రీసీతా రామ చంద్రస్వామి ఆలయంలో జస్టిస్ కొండా మాధవరెడ్డి శత జయంతి సందర్భంగా రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలో భజన మండలి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం దైవాలగూడ భజన మండలి సభ్యులను జ్ఞాపికలతో సత్కరించారు. కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. మాతాత, తండ్రికి భజనలు అంటే మమేకమైన ప్రేమ అన్నారు. వారు నెలకు ఒకసారి చేవెళ్ల మండలం ధర్మసాగర్‌కు వచ్చే వారని గుర్తు చేశారు. వారి జ్ఞాపకార్థం భజన మండలి భక్తులను ప్రోత్సాహిస్తున్నట్లు చెప్పా రు. కార్యక్రమంలో సర్పంచ్ పాండురంగారెడ్డి, శ్రీరాంనగర్ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ సందీప్, మాజీ సర్పంచ్ సురేష్‌గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్, భజన భక్తులు తిర్మల్‌రెడ్డి ఉన్నారు.

గొల్లకురుమల జీవితాల్లో వెలుగులు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: గొల్లకురుమల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సీఎం కేసీఆర్ గొర్రెల పంపిణీ పథకం తీసుకువచ్చారని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండలంలోని రేగడిఘనాపూర్‌లో శుక్రవారం రెండవ విడత గొర్రెల పంపిణీలో భాగంగా గ్రామానికి వచ్చిన 6 యునిట్లను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ కులవృత్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాడుతున్నాడని తెలిపారు. గతంలో తెలంగాణ రాష్టానికి మాసం దిగుమతులు ఉండేవి.. ప్రస్తుతం రాష్టం నుంచి మాంసం ఎగుమతులు చేసే స్థాయికి ఎదిగినట్లు చెప్పారు. అనంతరం గ్రామంలో కురుమ సంఘం నాయకులకు కమ్యూనిటీ హాల్‌కు కేటాయించిన స్థలంలో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటరంగారెడ్డి, సర్పంచ్ ఆర్.నర్సింలు, వైస్ ఎంపీపీ శివప్రసాద్, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి.నర్సింలు, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు సదానందం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేశ్, కుమార్, వెటర్నరీ వైద్యులు తిరుపతిరెడ్డి, దేవేందర్, శిరీష, ఎంపీడీఓ హిమబిందు,ఎంపీఓ విఠలేశ్వర్‌జీ కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.


గొర్రెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, తదితరులు

పర్యావరణ అనుమతులపై హర్షం

చేవెళ్ల: దశాబ్దాలుగా ఎదురుచుస్తున్న పాలమూరుకు కృష్ణమ్మ పరవళ్లు తొక్కేందుకు మార్గం సుగమమైందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు సాధించటం సీఎం కేసీఆర్ సాధించిన మరో చారిత్రాత్మక విజయమన్నారు. ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి మహబుబ్‌నగర్, నల్గొండ రంగారెడ్డి జిల్లాలకు 12.38 లక్షల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించేందుకు రూపకల్పన చేశారన్నారు. మొదటి దశలో తాగునీటి అవసరాలకు, రెండవ దశలో సాగునీటిని అందించేందుకు అవసరమైన కాలువలు ఇతర సదుపాయాలను నిర్మిస్తారని వివరించారు. ఈ సందర్భంగా టాపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, నర్సింలు, శివప్రసాద్, చంద్రశేఖర్, వెంకటేశంగుప్తా, నరహరిరెడ్డి, మల్లారెడ్డి, జైపాల్‌రెడ్డి, సత్తి, నాగార్జున్‌రెడ్డి, మల్లేశ్, రామగౌడ్, రాఘేందర్‌రెడ్డి, గని, నర్సింలు, నరేందర్, రాంప్రసాద్, కుమార్ ఉన్నారు.


కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

మొయినాబాద్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా ఎంపీ రంజిత్‌రెడ్డి ఆరోగ్య రథం ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని పెద్దమంగళారంలో శుక్రవారం ఎమ్మెల్యే ఆరోగ్య రథం సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీ రంజిత్‌రెడ్డి సొంత నిధులతో ఆరోగ్య రథాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి.. అవసరమైన వారికి శస్త్ర చికిత్స కూడా చేయిస్తారన్నారు. ప్రజలంతా ఆరోగ్య రథం సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉందన్నారు. మొయినాబాద్-చందానగర్ రోడ్డు అభివృద్ధికి రూ.15 కోట్ల నిధులు మంజూరయ్యాయని.. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీ అనంతరెడ్డి, స్థానిక సర్పంచ్ నరోత్తంరెడ్డి, ఉపసర్పంచ్ రజిత, ఎంపీటీసీలు లత, శ్రీనివాస్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మాదాసి కురువలు వెనుకంజ


నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

షాద్‌నగర్‌రూరల్: మాదాసి మాదారి కురువలు అన్ని రంగాల్లో వెనుబాటుకు గురయ్యారని ఆ సంఘం జిల్లా కన్వీనర్ ఎమ్మెసత్తయ్య పేర్కొన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని కమ్మదనంలో మాదా సి మాదారి కురువ సంఘం తాలుకా అధ్యక్షుడు సింధం విఠలయ్య ఆధ్వర్యంలో సంఘం నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సత్త య్య మాట్లాడుతూ.. మాదాసి కురువలకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలను అందజేయాలన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా యాదయ్య, మల్లయ్య, అధ్యక్షుడిగా శివకుమార్, ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్, సంయుక్త కార్యదర్శిగా కుమార్ కొములరయ్య, కోశాధికారిగా నాగులుతో పాటుగా, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వెంకటేశ్ నర్సింహ్మ, బీరప్ప, రాజు, అర్జున్, కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

నేర రహిత సమాజాన్ని నిర్మిద్దాం

సీఐ ప్రతాప్‌లింగం


దాతలను సన్మానిస్తున్న సీఐ ప్రతాప్‌లింగం

షాద్‌నగర్‌రూరల్: నేర రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రజలందరూ సహకరించాలని పట్టణ సీఐ ప్రతాప్‌లింగం అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో కౌన్సిలర్ ప్రేమలత ఆధ్వర్యంలో సీఐ ప్రతాప్‌సింగ్ సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కావాలన్నారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల నియంత్రణకు పోలీసుశాఖ అనేక చర్యలు చేపడుతుందన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని తెలిపారు. దొంగతనాలు, దోపిడీల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. వాణిజ్య సముదాయాలు, దుకాణాలు, ఇళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాతలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, కమిషనర్ వెంకన్న, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, కొండారెడ్డి, ప్రవీణ్, వెంకటేశ్, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా గ్రామాభివృద్ధి

సర్పంచ్ లావణ్య


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న లావణ్య

మొయినాబాద్: దశలవారీగా గ్రామంలోని అభివృద్ధి పనులు చేపడుతున్నామని సురంగల్ సర్పంచ్ గడ్డం లావణ్య అన్నారు. మండలంలోని సురంగల్‌లో గ్రామ పంచాయతీ నిధులు రూ.9 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే గ్రామంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మిగిలిపోయిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్లు, ఇతర పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ యాదమ్మ, వార్డు సభ్యులు సుప్రి య, భాస్కర్, షఫీ, విక్రంరెడ్డి, కార్యదర్శి సుహాసిని,మాజీ ఉపసర్పంచ్ అంజిరెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల సాయం.. గర్భిణి క్షేమం

కొత్తూరు: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ మహిళను సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు సాయం చేసి పోలీసులు మానవత్వం చాటుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలు శుక్రవారం స్థానికంగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం, రాయపల్లి గ్రామానికి చెందిన శివకుమార్ భార్య శ్రావణి(28). గతకొన్ని రోజుల క్రితం ప్రసవం నిమిత్తం కొత్తూరు పట్టణంలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. ఈ క్రమంలో గురువారం రాత్రి ఆమెకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకురాగా వారు పెద్ద ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. వారు 108 అంబులెన్స్ కోసం ఫోన్ చేయగా సకాలంలో రాలేదు. అప్పటికే పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కొత్తూరు పోలీస్‌స్టేషన్ సిబ్బంది యాదగిరి, హోంగార్డు రమేష్‌లు వారి పరిస్థితిని తెలుసుకుని వెంటనే పోలీసు వాహనంలో శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే 108 అంబులెన్స్ అక్కడికి రాగా హైదరాబాద్‌లోని నయాపూల్‌లో ఉన్న ప్రభుత్వ ప్రసూతి కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెను పరీక్షించిన వైద్యులు గర్భిణి క్షేమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.


గర్భిణిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

ఉచిత వైద్య శిబిరాలతో లబ్ధి

పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు భీంభరత్


ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్లు

షాబాద్: గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పీసీసీ ప్రచార కమిటీ సభ్యులు పామెన భీంభరత్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మన్‌మర్రిలో చిల్కూర్ బాలాజీ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని భీంభరత్ ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో డాక్టర్లు సాయిపవన్, మహేశ్వరీ, రజితశ్రీలు ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భీంభరత్ మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన వైద్య పరీక్షలు అందించేందుకు కార్పొరేట్ ఆస్పత్రులు ముందుకు రావాలన్నారు. దాతలు ముందుకు వచ్చి పేదలకు వైద్యసేవలు చేయించాలన్నారు. పీసీసీ కార్యదర్శి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించడం అభినందనీయమన్నారు. ఇలాంటి అవకాశాలను గ్రామీణ ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి భార్గవ్‌రామ్, చేవెళ్ల నియోజకవర్గం యువజన అధ్యక్షుడు పెంటారెడ్డి, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, నాయకులు మల్లీ మహేశ్, నర్సింహులు, చెన్నయ్య, వెంకట్‌రెడ్డి, రంగయ్య, వెంకటయ్య తదితరులున్నారు.

రాబోయే ఎన్నికల్లో బీజేపీదే విజయం

పార్టీ నాయకుడు వడ్రీ తులసీరామ్ విజయ్‌కుమార్


బీజేపీ అసెంబ్లీ పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న నాయకులు

చేవెళ్ల: రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని బీజేపీ నియోజకవర్గం నాయకుల వడ్రీ తులసీరామ్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన బీజేపీ అసెంబ్లీ పార్టీ కార్యాలయాన్ని స్థానిక బీజేపీ రాష్ట్ర కమిటీ నాయకులు విఠల్‌రెడ్డి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డిలతో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీజేపీ గ్రామస్థాయిలో బలోపేతమవుతోందని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు యువత పాత్ర కీలకంగా ఉండబోతుందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌పార్టీలు చెప్పే మాటలు, చేసిన మోసాలను ప్రజలు గమనిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అత్తెల్లి అనంత్‌రెడ్డి, రాములు, శ్రీనివాస్, సత్యం, కృష్ణారెడ్డి, రవి, ప్రవీణ్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ బదిలీలు వెంటనే ఆపాలి


చేవెళ్ల: సభ్యత్వ నమోదు చేస్తున్న పీఆర్టీయూ నాయకులు

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్

మొయినాబాద్‌రూరల్: ఇతర జిల్లాల నుంచి రంగారెడ్డి జిల్లాలోకి వచ్చే అక్రమ బదిలీలను ప్రభుత్వం వెంటనే ఆపాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్‌యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని జిల్లా పరిషత్ కనకమామిడి, అమ్డాపూర్, యూపీఎస్ ముర్తుజాగూడ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం మండల అధ్యక్షుడు బందయ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్‌యాదవ్ పాల్గొని ఉపాధ్యాయులకు సభ్యత్వ నమోదు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. అక్రమ బదిలీలను ప్రభుత్వం నిలిపి వేయాలన్నారు. లేని పక్షంలో పీఆర్టీయూ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో పోరుబాట తప్పదని హెచ్చరించారు. పీఆర్సీ కమిషన్ వెంటనే వేయాలని, మధ్యాంతర భృతి ప్రకటించాలని కోరారు. వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లు ఆపి రెగ్యులరైజేషన్ చేసి బదిలీలు పదోన్నతలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు బందయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణ, రాములు, సత్యనారాయణరెడ్డి, సంజీవన్‌కుమార్, నరేందర్, రాజేంద్రనగర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, విజయ్, చైతన్యం, ఉమా, మంజుల, సంగీత పాల్గొన్నారు.

త్వరలో బదిలీలు

చేవెళ్ల: రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యలు త్వరలో పరిష్కారమవుతాయని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి అన్నారు. పీఆర్టీయూ సభ్యత్వ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని ఊరెళ్ల, గుండాల, మల్కాపూర్, చనువెల్లి ప్రభుత్వ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఓ 317కు సంబంధించిన బాధిత ఉపాధ్యాయులను స్థానిక జిల్లాలకు తీసుకువచ్చే బాధ్యత పీఆర్టీయూ తీసుకుంటుందని చెప్పారు. కోర్టు జడ్జిమెంట్ వచ్చిన వెంటనే బదిలీలతో కూడిన ప్రమోషన్‌లు వస్తాయన్నారు. పండితుల సమస్యలు కూడా త్వరలోనే పరిష్కరం అవుతాయని వివరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ చేవెళ్ల మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సత్తయ్యగౌడ్, వినోద్, జిల్లా బాధ్యులు కరుణాకర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు అందజేస్తున్న గోవర్ధన్‌యాదవ్

ఆశీర్వదించండి అండగా ఉంటా..

బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి

కొందుర్గు: ఆశీర్వదించండి అండగా ఉంటానని బీజేపీ నేత పాలమూరు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. రాఖీ కానుకలో భాగంగా శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని చేగిరెడ్డిఘనాపూర్, చెన్నారెడ్డిగూడ, ముష్టిపల్లి, కాసులబాదు, ఎదిర, రావిర్యాల తదితర గ్రామాల్లో పర్యటించి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఓట్ల కోసం రాలేదని, ప్రజాసేవే కర్తవ్యంగా భావిస్తూ నమో మాతృమూర్తి, వేసవిలో రాగి అంబలి పంపిణీ, కరోనా సమయంలో కరోనా కిట్ల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కుర్మయ్య, నాయకులు శ్యామ్, సుందర్‌రెడ్డి, ప్రదీప్, ముర్షద్, రాజు పాల్గొన్నారు.


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

భవిష్యత్తుకు బంగారు బాటలు

ప్రొఫెసర్ డాక్టర్ సుందరం కృష్ణ

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు ఇష్టపడి చదివితేనే భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకుంటారని మద్రాస్ ఎమిరైట్స్ ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ మంగల సుందరం కృష్ణ, హైదరాబాద్ గోల్డెన్ టెంపుల్ హరే కృష్ణ ప్రద్యుమ్నా కృష్ణదాస్‌లు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అమ్డాపూర్ చౌరస్తాలోని జేబీఐఈటీ కళాశాలలో ఓరియంటేషన్ డేను కళాశాల కార్యదర్శి జేవీ.కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు ఒకెత్తు.. 11, 12వ తరగతులు రెండవ ఎత్తు అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉన్నత విద్య ఎంతో ముఖ్యమని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రతి రోజు కళాశాలకు పంపిస్తే వారి భవిష్యత్తు ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం కళాశాల కార్యదర్శి కృష్ణారావు మాట్లాడుతూ .. జేబీఐఈటీ కళాశాల ఏర్పాటు చేసి 26 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం స్కిల్స్, టిహబ్ మా కళాశాలలో ప్రత్యేకమైన విభాగాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో విద్యా సంస్థల సీఈఓ ఎస్ఎస్ దనక, కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణామాచారి, క్యాంపస్ అడ్మినిస్ట్రేటర్ రాజశేఖర్‌రెడ్డి, జేబీఐటీ డీన్ నీరజ్ ఉపాధ్యాయ, ప్రిన్సిపాల్‌లు సమగ్ర పట్నాయక్, డాక్టర్ శ్రీనివాస్‌రావు, డాక్టర్ శర్మ, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కొల్లగొడుతున్నారు..

ప్రజాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్‌కుమార్‌యాదవ్

మొయినాబాద్‌రూరల్: సీఎం కేసీఆర్ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రభుత్వ భూములను కార్పొరేట్ శక్తులతో కుమ్మకై వేలం వేస్తున్నారని ప్రజాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్‌కుమార్ యాదవ్ ఆరోపించారు. శుక్రవారం మండలంలోని కనకమామిడిలో ప్రజాపార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి ఆలూరు రమేష్ ఆధ్వర్యంలో చేవెళ్ల నియోజకవర్గ స్థాయి ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అజయ్‌కుమార్‌యాదవ్ పాల్గొని మాట్లాడారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సీఎం కేసీఆర్ పరిపాలన ప్రజాస్వామ్య విరుద్ధంగా సాగుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలు అవుతున్నా విద్యార్థి, రైతు ,ప్రజల సమస్యలను గాలికి వదిలేశారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్‌పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. కులాల మధ్య ఓట్ల బదులాయింపు జరిగినప్పుడే బహుజన రాజ్యాధికారం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజాపార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అంజియాదవ్, స్టేట్ మీడియా కన్వీనర్ ప్రశాంత్, నియోజకవర్గం ఇన్‌చార్జి మల్లేష్, రాజేష్, యాదయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అజయ్‌కుమార్‌యాదవ్

చర్చి నిర్మాణం ఆపేయండి

శంకర్‌పల్లి: దేవాదాయ శాఖ పరిధిలోని భూమిలో నిర్మిస్తున్న చర్చి నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని హిందూ జనశక్తి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని మియాఖాన్ గడ్డలో వేణుగోపాలస్వామి ఆలయం భూములు దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్నాయని తెలిపారు. అనుమతులు లేకుండా చర్చి నిర్మాణం చేపట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే నిర్మాణాలను నిలిపివేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో హిందూ సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు లలిత్‌కుమార్, కోశాధికారి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పశుపోషణలో మెలకువలు తప్పనిసరి


కొత్తూరు: జీవాలకు మందులు వేస్తున్న వైద్యురాలు

పశువైద్యాధికారి స్ఫూర్తి

కొత్తూరు: పశుపోషణలో రైతులు మెలకువలు పాటిస్తే మంచి లాభాలు పొందవచ్చని మండల పశువైద్యురాలు స్ఫూర్తి అన్నారు. శుక్రవారం ఆమె కొత్తూరుతో పాటు రెడ్డిపాలెంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, నట్టల నివారణకు మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులకు అవగాహన ఉండాలన్నారు. పశువులు అనారోగ్యాలకు గురైతే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చికిత్సలు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీలత, మల్లయ్య, కృష్ణ, రవి, రాజు, రైతులు పాల్గొన్నారు.

పాడిపశువుల ఆరోగ్యంపై అప్రమత్తత

మొయినాబాద్‌రూరల్: పాడి పశువులకు ఎలాంటి రోగాలు దరి చేరకుండా రైతులు కాపాడుకోవాలని మండల పశువైద్య అధికారి దేవిరెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని బాకారంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి 286 పశువులకు నట్టల నివారణ, గాలికుంటు, చర్మవ్యాధి నివారణ టీకాలు వేశారు. అలాగే, పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాలకు పశువైద్య అధికారులు వచ్చినప్పుడు వారికి సహకరించి పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. అనారోగ్యానికి గురైన వెంటనే చికిత్స చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం ద్వారా అన్ని రకాల ఉచిత వైద్య చికిత్సలతో పాటు మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కుమార్, శివకుమార్, రవి పాల్గొన్నారు.